

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

జగన్ పర్యటన.. ఉత్కంఠ

- గతంలో జరిగిన విషాదాల నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు
- అనుమతుల్లేకపోయినా బలప్రదర్శనకు సిద్ధమవుతున్న వైసీపీ
- పోలీసుల అనుమతి 500 మంది.. వైసీపీ టార్గెట్ 30 వేలు..
- ఇప్పటికే బంగారుపాళ్యంలో 600 మంది పోలీసులు, అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులు
- మాట వినకుంటే అత్యంత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధం



బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలో జాతీయ రహదారి పక్కన వైసీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

చిత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పోలీసుల ఆంక్షలు. మరోవైపు వీటిని ధిక్కరించేలా వైసీపీ ప్రయత్నాలు. దీంతో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బుధవారంనాటి బంగారుపాళ్యం పర్యటన ఒక రకమైన ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల జగన్ పర్యటించినప్పుడు అక్కడ సంభవించిన మరణాలు, ప్రమాదాల నేపథ్యంలో పోలీసులు ఆంక్షల్ని విధించారు. పూతలపట్టు ఇన్‌చార్జి సునీల్ ఇచ్చిన అర్జీ మేరకు ఎస్పీ మణికంఠ 500 మందికి అనుమతి ఇచ్చారు. అనుమతుల్ని ఖాతరు చేయని వైసీపీ నాయకులు పెద్దఎత్తున జనాల్ని తరలించేందుకు సిద్ధమయ్యారు. మండలానికి వెయ్యి చొప్పున 30వేల మంది టార్గెట్ పెట్టుకున్నా.. 10వేల మంది వస్తారని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని పోలీసులతో పాటు తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున పోలీసులు మంగళవారమే బంగారుపాళ్యం చేరుకున్నారు. సుమారు 600 మంది పోలీసులు బంగారుపాళ్యంలో ఉన్నారు. ఎస్పీ మణికంఠ, డీఎస్పీ తదితర అధికారులు మంగళవారం బంగారుపాళ్యంలో పర్యటించి.. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హెలిప్యాడ్ వద్ద 30మంది, మార్కెట్ యార్డులో 500 మందికి మించి అనుమతించకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే బంగారుపాళ్యం వచ్చే అన్ని హైవే, గ్రామీణ మార్గాల్లో పెద్దఎత్తున చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేశారు. ఆయామార్గాల నుంచి వచ్చే వాహనాలను అక్కడే అడ్డుకుంటారు. ఆర్టీసీ బస్సుల్ని సైతం తనిఖీలు చేయనున్నారు. చెక్‌పోస్టుల్లో ప్రజల్ని వెనక్కి వెళ్లిపొమ్మని చెప్తారు. మాట వినకుంటే అత్యంత కఠినంగా వ్యవహరించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన జగన్ పర్యటనల్లో వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ఘర్షణలు చేశారని, బంగారుపాళ్యంలో కూడా అలాంటి పనులు చేసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లోని పర్యటనలో చోటు చేసుకున్న సంఘటనలు బంగారుపాళ్యంలో రిపీట్ అవ్వకుండా గట్టిగా వ్యవహరించేందుకు సమాయత్తంగా ఉన్నారు. బారికేడ్లను తోసుకుని వస్తాం, మాట వినకుండా చెక్‌పోస్టులను దాటేస్తాం అనేవారి పట్ల పోలీసులు తీవ్ర చర్యలు తీసుకునే అవకాశముంది.

‘రాజకీయ లబ్ధి కోసమే పర్యటన’

బంగారుపాళ్యం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ‘రాజకీయ లబ్ధికోసమే మాజీ సీఎం జగన్ బంగారుపాళ్యంలో పర్యటిస్తున్నారు. ఆయనపర్యటనతో రైతులకు ఎలాంటి లాభం లేదు’ అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో మామిడి మండీ యజమానులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 6.50 లక్షల మెట్రిక్ టన్నులకు రూ.4 సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వైసీపీ నేతలకు చెందిన గుజ్జు పరిశ్రమ యాజమాన్యాలు టన్ను తోతాపురి ఏ ధరకు కొన్నారో బయటపెట్టాలని డిమాండ్‌చేశారు. టీడీపీ నేతలను ఉద్దేశపూర్వకంగానే వైసీపీ నేతలు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. జగన్ పర్యటన అంతా ఓ డ్రామా అని.. దాన్ని తిప్పికొట్టాలని రైతులకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, జనార్దన్‌గౌడ్, బీసీ రవీంద్రనాయుడు, లోకనాథనాయుడు, బాబురెడ్డి, సూరినాయుడు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మండీ యాజమానులు, టీడీపీ నాయకులు

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

పోలీసుల హెచ్చరిక

నిబంధనలను అతిక్రమించి మాజీ సీఎం జగన్ పర్యటనకు జనాలను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సాయినాథ్, ఐరాల ఎస్‌ఐ నరసింహులు, నగరి రూరల్ సీఐ భాస్కర్, గంగవరం సీఐ ప్రసాద్, సదుం ఎస్‌ఐ షేక్ షావలి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. ఇప్పటికే వైసీపీ నాయకులకు నోటీసులు అందజేయడం జరిగిందన్నారు.

ఐదేళ్లు దోచుకుని ఇప్పుడేమో ఎవరి ఖర్చులు వారివా?

- మాజీ సీఎం పర్యటన ఖర్చు విషయంలో వైసీపీ నేతల మధ్య పొరపొచ్చాలు

చిత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ బంగారుపాళ్యం పర్యటన నేపథ్యంలో జిల్లా వైసీపీ నేతల మధ్య పొరపొచ్చాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. బంగారుపాళ్యం మండలం పూతలపట్టు నియోజకవర్గంలోకి వస్తుండడంతో మొత్తం ఖర్చును అక్కడి ఇన్‌చార్జి సునీల్‌కుమార్ భరించాలని తొలుత ‘బడా’ నాయకుడు సూచించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యే కానని, అంత మొత్తం భరించలేనని ఆయన వివరణ ఇచ్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. తన నియోజకవర్గం వరకే ఖర్చు పెట్టుకునేందుకు ఒప్పుకున్నట్లు సమాచారం. మిగతా నియోజకవర్గాల్లోనూ ఆయా ఇన్‌చార్జులు ఖర్చు పెట్టుకుని ప్రజల్ని తరలించాలని ఆ బడా నేత సూచించారట. మొత్తం ఖర్చు ఆ బడా నాయకుడే భరిస్తారని అనుకున్నా.. ఆయన పట్టించుకోక పోవడంతో ‘ఐదేళ్ల పాటు మైన్స్‌లో, వైన్స్‌లో భారీగా దోచుకుని ఇప్పుడు అధినేత పర్యటన ఖర్చును విభజించడం ఏంట’ని వైసీపీ నేతలు చర్చించుకుంటున్నారు. ఆ బడా నాయకుడు కూడా తన నియోజకవర్గంలో మాత్రమే ఖర్చు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. వచ్చిన ప్రజల్ని చూసి పంచాయతీకి ఓ మొత్తం అని నిర్ణయించి పంపిణీ చేయనున్నారు. చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి 2029 ఎన్నికల్లో టికెట్ ఆశిస్తుండడంతో ఆ దిశగా జనసమీకరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తన కొడుకు అభినయ్‌రెడ్డిని ఎలివేషన్ చేసుకునేందుకు నియోజకవర్గం నుంచి సుమారు వెయ్యి మందితో వచ్చి బలప్రదర్శన చేయనున్నట్లు తెలుస్తోంది. పలమనేరు నుంచి వెంకటేగౌడ, కుప్పం నుంచి భరత్, జీడీనెల్లూరు కృపాలక్ష్మి తమ వంతుగా నామమాత్రంగా జనాల్ని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. జన సమీకరణలో నగరి నుంచి రోజా పాత్ర పెద్దగా లేనట్లు తెలుస్తోంది.

పర్యటన వివరాలు

చిత్తూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బుధవారం బంగారుపాళ్యం పర్యటన వివరాలను వైసీపీ నాయకులు విడుదల చేశారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని ఎలహంక నివాసం నుంచి 9.50 గంటలకు జకూర్ విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.50 గంటలకు బంగారుపాళ్యం మండలం కొత్తపల్లె వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11 గంటలకు హెలిప్యాడ్ వద్ద నుంచి కారులో మార్కెట్‌యార్డుకు బయల్దేరుతారు. 11.20 గంటలకు మ్యాంగో మార్కెట్ వద్దకు చేరుకుంటారు. 11.20 నుంచి 12.20 గంటల వరకు రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 12.35 గంటలకు మార్కెట్ యార్డు నుంచి కొత్తపల్లె వద్ద హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12.45 గంటలకు హెలిప్యాడ్ నుంచి బెంగళూరుకు బయల్దేరుతారు.

రేపు మెగా పీటీఎం

ప్రతి పాఠశాలకు ఓ అధికారి నియామకం

చిత్తూరు సెంట్రల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల ఉపాధ్యాయుల మెగా సమావేశం 2.0(పీటీఎం) జరగనుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ముందస్తు ఏర్పాట్లపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయి, స్పెషల్ అధికారులతో మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం నిర్వహణకు ప్రతి పాఠశాలకు ఒక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి గ్రామస్థాయి ప్రజాప్రతినిధులవరకు సమాచారం ఇచ్చి ప్రత్యేకంగా ఆహ్వానించాలని సూచించారు. కొన్ని పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు, దాతలు, హాజరు కానున్న నేపత్యంలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో పోలీసు బందోబస్తు ఉంటుందని చెప్పారు. సమావేశం పూర్తయ్యాక ఆటల పోటీలు, పాఠశాల ప్రాంగణంలో తల్లి పేరుతో మొక్కలు నాటడం, మధ్యాహ్న భోజనం పథకం కింద భోజన ఏర్పాట్లు ఉంటాయని వివరించారు.

నిధుల కేటాయింపు

జిల్లాలోని 2,444 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలలకు పాఠశాల అభివృద్ధి నిధుల కింద తొలి దశలో రూ.2,68,82,500 (50శాతం) సమగ్రశిక్ష విభాగం విడుదల చేసింది. 1,896 ప్రాథమిక పాఠశాలలకు రూ.1.48కోట్లు, 517 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.1.11కోట్లు, 31 జూనియర్ కళాశాలకు రూ.9.62 లక్షలు కేటాయింపులు చేసింది. ఇందులో 20 శాతం మొత్తాన్ని మెగా పీటీఎంకు నిర్వహణకు పాఠశాల కమిటీ ద్వారా ఖర్చు చేయడానికి అనుమతి ఇచ్చింది.

2,984 విద్యాసంస్థల్లో పీటీఎం

జిల్లాలోని 2,984 ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం నిర్వహించనున్నారు. 2,60,641 మంది విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు సుమారు 1.65 లక్షల మంది కార్యక్రమంలో పాల్గొననున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మా డబ్బులు ఏమయ్యాయి?

మహిళా మార్టులో పెట్టుబడి పెట్టిన డ్వాక్రా మహిళల నిరసన



పెనుమూరు మహిళా మార్టు



నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

పెనుమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ‘పెనుమూరులోని మహిళా మార్టు కోసమని మా దగ్గర తీసుకున్న డబ్బులు ఏమయ్యాయి. ప్రతి ఏడాదీ లాభాల్లో వాటా ఇస్తామన్నారు. మూడేళ్లవుతున్నా మా డబ్బుల సంగతి చెప్పడం లేదు. ప్రతినెలా ఒక్కో మహిళ వెయ్యి రూపాయలకు సరుకులు కొనాలని నిబంధన పెట్టి మరీ కొనిపించారు’ అంటూ మంగళవారం డ్వాక్రా మహిళలు వెలుగు కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గత ప్రభుత్వంలో ఒక్కో సభ్యురాలి వద్ద రూ.300 చొప్పున మండలం మొత్తం 950 గ్రూపుల నుంచి రూ.28 లక్షలు వసూలు చేసి, మహిళా మార్టులో పెట్టుబడులు పెట్టారు. దీంతోపాటు సీఎఫ్‌ఐ ద్వారా రూ.25 లక్షలు, బీఎంసీయూ నుంచి రూ.7.5లక్షలు మొత్తం రూ.60లక్షలతో 2022లో మార్టు ప్రారంభించారు. అమ్మమొత్తం రూ.4కోట్లు అమ్మకాలు జరిగాయని.. రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. 20 శాతం లాభాలు వచ్చినా ఆ లెక్కన రూ.60 లక్షలు మిగులు తేలాలి. కానీ బ్యాంకు ఖాతాలో నగదు లేవంటే అవినీతి ఏ మేరకు జరిగిందో తెలుస్తుంది. కొన్ని లావాదేవీలకు లెక్కలు చూపక పోవడంతో మార్టులో దోబీలను, అకౌంటెంట్‌ను జిల్లా అధికారులు తొలగించారు. ఏపీఎం, సీసీలకు షోకాజ్ నోటీసులిచ్చి మళ్లీ వారిని విధుల్లోకి తీసుకున్నారని మహిళలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే.. మార్టును పంచాయతీ కార్యాలయంలో పెట్టాలని ఆ భవనం రీమాడలింగ్‌కు రూ.20లక్షల వరకు లెక్కలు రాసి.. టాయిలెట్‌కే రూ.3లక్షలు ఖర్చు చూపినట్లు సమాచారం. ఇకనైనా మహిళా మార్టు విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు.

మామిడి రైతులు నష్టపోకుండా చర్యలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

గుడిపాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ మ్యాంగో ఫ్యాక్టరీ వద్ద బారులు తీరిన మామిడి ట్రాక్టర్ల వద్ద రైతులతో మాట్లాడారు. మామిడి తోటల్లో ఎంత కాపు మిగిలి ఉందని అడిగి తెలుసుకున్నారు. రైతుకు చెందిన చివరి మామిడి కాయను అమ్మేవరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులెవరూ కూడా అధైర్యపడవద్దని చెప్పారు. ఫ్యాక్టరీల వద్ద ఏమైనా ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ ద్వారా తనకు తెలియజేయాలని కోరారు. రోడ్డు పక్కన ట్రాక్టర్లు, లారీలు నిలిపినపుడు ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక ఎస్‌ఐకి ఫిర్యాదు చేయాలన్నారు.

ఏనుగుల మంద స్వైరవిహారం

భయాందోళనలో రైతులు





ధ్వంసమైన టమోటా తోట - అడవిలోకి వెళ్తున్న ఏనుగులు

రామకుప్పం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని 89పెద్దూరు గ్రామ సమీప తోటలపై సోమవారం రాత్రి ఆరు ఏనుగుల మంద స్వైరవిహారం చేసింది. తమిళనాడు అడవుల నుంచి వి.కోట మండలం నాయకనేరి అడవుల మీదుగా వచ్చిన ఏనుగులు 89పెద్దూరు గ్రామానికి చెందిన పలువురి అరటి, టమోటా, మామిడి తోటలపై దాడులు చేసి.. విధ్వంసం సృషించాయి. ఓ రైతుకు చెందిన 30 అరటిచెట్లను ధ్వంసం చేశాయి. మరో రైతు టమోటా తోటను కొంతమేర ధ్వంసం చేశాయి. సమీప మామిడి తోటల్లో సంచరిస్తూ మామిడికాయలు, పండ్లను తిన్నంతగా తిని.. నేలరాల్చాయి. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు, ట్రాకర్లతో కలిసి పెద్దూరు అటవీ ప్రాంతానికి చేరుకుని డప్పులు వాయిస్తూ, టపాకాయలు పేల్చుతూ ఏనుగుల మందను అడవిలోకి తరిమేశారు. ఇప్పటికే 15 రోజులుగా ననియాల గ్రామ పరిసర పొలాలు, తోటలపై ఒంటరి ఏనుగు దాడి చేస్తున్న విషయం తెలిసిందే. ఇపుడీ ఏనుగుల మంద కూడా తోడవడంతో అటవీ సమీప గ్రామాల రైతులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఏనుగులను పొలాలు, గ్రామాల వైపు రాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయాల్లో దేవదాయశాఖ ఆర్జేసీ విచారణ

చిత్తూరు కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆలయాల్లో జరిగిన సంఘటనలపై దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) చంద్రశేఖర్ అజాద్ మంగళవారం విచారణ నిర్వహించారు. ఇటీవల చౌడేపల్లె బోయకొండ గంగమ్మ, మొగిలి ఆలయం, చిత్తూరులోని కోదండ రామాలయం, కట్టమంచి కులందేశ్వర ఆలయంలో చోటుచేసుకున్న సంఘటనలపై ఆయా ఆలయాలకు వెళ్లి పరిశీలించి, ఈవోలను విచారించారు. నగరంలోని మహావీర్ ఓవర్ బ్రిడ్జి పక్కనున్న జీవకారుణ్య అన్నదాన సమాజానికి చెందిన భూమి లీజుకు ఇచ్చిన వైనంపై కూడా విచారణ చేశారు. కోదండరామాలయంలో అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌జేసీ పర్యటనలో ఏసీ చిట్టెమ్మ, జిల్లా ఎండోమెంట్ ప్రొటోకాల్ రూట్ సిబ్బంది తిమ్మారెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, అధికారులు మునిశేఖర్, వెంకట్రాయలు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనంలో ‘డీఈఐసీ’ ప్రారంభోత్సవం
పంటలపై ఆగని గజదాడులు
బిచ్చగాడిని చంపిన మరో బిచ్చగాడు
వందశాతం రాయితీతో ఆయిల్‌పాం మొక్కలు
7లో

పరిశ్రమల స్థాపన వేగవంతం చేయాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు సెంట్రల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సింగిల్‌విండో పద్ధతిలో అనుమతుల వేగవంతంపై ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.8.39 కోట్లతో 547 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ద్వారా ఉత్పత్తులు ప్రారంభించడంతో 1604మందికి ఉపాధి లభించినట్లు వివరించారు. రూ.3494 కోట్లతో 13 పెద్ద, మధ్యమ, రూ.117 కోట్లతో 38 సూక్ష్మ, చిన్న పరిశ్రమల స్థాపనకు సింగిల్‌విండో పద్ధతిలో అనుమతులు మంజూరుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వీటి ద్వారా 20వేల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. ఏప్రిల్ 2025 నుంచి ఇప్పటి వరకు సింగిల్ డెస్క్ ద్వారా 532 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 520 ఆమోదించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. నియోజక, మండల స్థాయిలో పీఎంజీవైపై విస్తృత అవగాహన కల్పించాలని, ఈనెల రెండోవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు ప్రభుత్వం అమలు చేసే వివిధ యాప్‌పైన శిక్షణ తరగతులు నిర్వహించాలని పరిశ్రమల జీఎంను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన కింద 2131 యూనిట్లు అనుమతులు మంజూరు చేసి ఇప్పటి వరకు 1843 మందికి లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ ద్వారా 80 యూనిట్లకు రూ.2.22 కోట్లు సబ్సిడీ మంజూరుకు సిఫార్సు చేశామన్నారు. సమావేశంలో ఇండస్ట్రీస్ జీఎం సూరిబాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ టాక్స్ శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వైవీ సుబ్బారావు, ఫెఫ్సియా ప్రతినిధి మధుసూదన్, ఫుడ్ ప్రాసెస్ అసోసియేషన్ ప్రతినిధి గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

పీపీఈ ద్వారా నందరావు బయోఎనర్జీ ప్లాంట్

జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన నందరావు బయోఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం కలెక్టరేట్‌లోని పరిశ్రమలపై నిర్వహించిన సమావేశం నుంచి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా వీక్షించారు. రూ.50కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు చేసే ఈ ప్లాంటు రోజువారీ 10 టన్నుల ఎనర్జీని ఉత్పత్తి చేయనున్నట్లు ప్రతినిధులు వివరించారు. దీనిద్వారా 200 మందికి ప్రత్యక్షంగా, వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, చిత్తూరు జిల్లా
2వ అంతస్తు, వివేకానంద భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరు జిల్లా.

2025-27 సంవత్సరమునకు సంబంధించి ప్రజా పంపిణీ పథకం క్రింద స్టేజి-II ద్వారా ఆహార ధాన్యములు మరియు ఇతర నిత్యవసర వస్తువులు రవాణా చేయుట కొరకై

రీ - టెండరు నోటీసు

నం.పి.డి.ఎస్/3/స్టేజి-II/చిత్తూరు 2025-27 తే : 08-07-2025

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, చిత్తూరు వారి తరపున జిల్లాలోని అన్ని మండల స్థాయి గోదాముల నుండి / నిల్వ గోదాముల నుండి వాటికి అనుసంధానింపబడిన మండలాలలోని చౌక ధర దుకాణములకు, స్కూల్స్, హాస్టల్స్ మరియు ఐ.సి.డి.ఎస్ కేంద్రాలకు ఎపటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొనబడు ఇతర ప్రదేశాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయు బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువులను 2025-27 (అగ్రిమెంట్ తేది నుండి 31-3-2027 వరకు) సంవత్సరములకు స్టేజి II క్రింద రవాణా చేయుటకు ఆన్లైన్ రీ- టెండరు కోరబడుచున్నవి. మండల స్థాయి గోదాములు ఈ కేంద్రములలో కలవు. 1) చిత్తూరు, 2) గంగాధర నెల్లూరు, 3) పూతలపట్టు, 4) బంగారుపాళ్యం, 5) పలమనేరు, 6) వి.కోట 7) శాంతిపురం, 8) కుప్పం, 9) పుంగనూరు, 10) సదుం, 11) రొంపిచెర్ల, 12) కార్వేటినగరం, 13) పచ్చికాపల్లం మరియు 14) నగరి.

స్టేజ్- II రవాణా కాంట్రాక్టుకు సంబంధించిన రీ-టెండరు ప్రక్రియ పూర్తిగా AP e-procurement పోర్టల్ నందు మాత్రమే జరుగును. (website Address : https://tender.apeprocurement.gov.in).

ఆసక్తి గల రవాణాదారుడు/ సంస్థ https://tender.apeprocurement.gov.in website ను సందర్శించి బిడ్ డాక్యుమెంట్ మరియు రీ- టెండరు ప్రకటన వివరాలను పొందవచ్చును. అదేవిధంగా టెండరును దాఖలు చేయుటకు పైన తెలిపిన website నందు రిజిస్టర్ చేసుకుని రూ.5900/- @ 18% GST తో కలుపుకొని టెండర్ షెడ్యూల్ కొరకు ఆన్‌లైన్ ద్వార చెల్లించి టెండరు డాక్యుమెంట్ ను డౌన్లోడ్ చేసుకోగలరు.

AP e-procurement పోర్టల్ నందు టెండరు డాక్యుమెంట్ పొందవలసిన మరియు అప్‌లోడ్ చేయవలసిన తేది మరియు సమయముల వివరములు

వివరములు తేదీ మరియు సమయము

1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ 10-07-2025 ఉ॥ 10.30 గంటల నుండి
2. ఆన్‌లైన్ బిడ్‌లు స్వీకరణకు చివరి తేదీ 20-07-2025 సా॥ 5.00 గంటలకు.
3. టెక్నికల్ టెండర్స్ పరిశీలించు తేది 21-07-2025 ఉ॥ 11.00 గంటలకు
4. ఫైనాన్షియల్ బిడ్ పరిశీలించు తేదీ 22-07-2025 ఉ॥ 11.30 గంటలకు

జాయింట్ కలెక్టర్ మరియు పదవి రీత్యా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా

ముగిసిన జ్యేష్టాభిషేకం





తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన కవచ సమర్పణ క్రతువుతో జ్యేష్టాభిషేకం ముగిసింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని మండపంలోకి వేంచేపుచేశారు. వివిధ క్రతువులు నిరవహించారు. శాత్తుమొర, ఆస్థానం జరిపించి మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30గంటల మధ్య స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కవచ సమర్పణ పూర్తిచేశారు. సాయంత్రం ఉభయనాంచారులతో స్వామివారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవర్లను దర్శించుకున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి


అమ్మవారి సేవలో చెన్నై హైకోర్టు సీజే



ఆలయం వద్ద జస్టిస్ కేఆర్ శ్రీరామ్

తిరుచానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి):పద్మావతి అమ్మవారిని మంగళవారం చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం తమిళనాడు బీజేపీ నేత అన్నామలై కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.48 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,081

తలనీలాలు సమర్పించినవారు: 28,775

చరమాంకంలోనూ చెదరని సంకల్పం

● పురాతన కరెన్సీ, నాణేల సేకరణ హాబీ ● 75 ఏళ్ల వయసొచ్చినా అదే అభిరుచి



కణన్ షణ్ముగం, సేకరించిన నాణెలు, కరెన్సీ

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 75ఏళ్ల వయసులోనూ తన అభిరుచి కోసం పరితపిస్తున్నారాయన. పురాతన నాణేలను,కరెన్సీని సేకరించాలని పట్టుదలతో ముందడుగు వేస్తున్నారు. ఈక్రమంలోనే కోట మండలం చిట్టేడు గ్రామానికి ఇటీవల వచ్చారు కణన్ షణ్ముగం. తన విశేషాభిరుచి గురించి ఆయన ఆంధ్రజ్యోతితో పంచుకున్నారిలా.. మాది చిత్తూరు. మానాన్న తమిళనాడులోని రాయవేలూరులో స్థిరపడ్డారు. నేను 1973-74ప్రాంతంలో ఇండియా తరపున ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా వ్యవహరించాను. పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. భార్య చెన్నైలో ఉంది. నాకు పురాతన నాణేలు,వివిధ దేశాల కరెన్సీ సేకరించడమంటే ప్రాణం. ఈక్రమంలోనే 50 ఏళ్లుగా చాలా దేశాల్లో తిరిగాను. ఆయా దేశాలకు సంబంధించి 700 నుంచి 800 ఏళ్ల నాటి కరెన్సీ నోట్లు, నాణెలను సేకరించాను. అమూల్యమైన నాణేలను ఇప్పటికీ చెక్కు చెదరకుండా భద్రపరిచాను. నాదగ్గరున్న యూకే నాణేలు చాలా ఖరీదైనవి. పురాతన కరెన్సీ, నాణేలను ఆయా దేశాల మ్యూజియంలకు అప్పగించాలనేది నా సంకల్పం. మూడు నెలలుగా చిట్టేడు విద్యానగర్‌లోని స్నేహితుడి ఇంటి వద్ద ఉంటున్నాను. పురాతన నాణేల సేకరణలో భాగంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో తిరుగుతున్నాను. ఈగ్రామ ప్రజలకు పురాతన నాణేలు,కరెన్సీ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు షణ్ముగం వివరించారు.

తిరుమలలో మళ్లీ తట్టల జోరు

● కొత్తగా 20 తట్టలకు అనుమతి?

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా తిరుమల కొండమీద కొందరి దందా మాత్రం యధాతధంగానే కొనసాగుతోంది. తిరుమలలో అనధికార తట్టలు(చిన్నపాటి అంగళ్లు) నిదానంగా విస్తరిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కావలసినవారికి, కోరుకున్న చోట ఇష్టానుసారం తట్టలకు అనుమతులు ఇచ్చేశారు. కోట్లరూపాయలు చేతులు మారినట్టు దీని మీద ఆనేక ఆరోపణలు కూడా వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీ ప్రక్షాళనలో భాగంగా అనధికార తట్టలకు అవకాశం ఉండబోదని అనుకున్నారు. అలాగే అనుమతి ఆధారంగా ఇష్టమొచ్చిన వ్యాపారాలు చేసుకోవడానికి కూడా వీలుండదని భావించారు. కొద్ది రోజులు పరిస్థితి మారినట్టు కనిపించింది. విజిలెన్స్ విభాగం ఈ అంశంపై విచారించి తట్టలకు అనుమతుల జారీలోనూ, స్థల మార్పిడిలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఒక నివేదిక కూడా ఇచ్చింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో తట్టలు కూడా తొలగించడంతో ఇక పద్ధతి ప్రకారమే అంతా జరుగుతుందని అనుకున్నారు. అయితే మళ్లీ అంతా మొదటికొచ్చింది. అనధికార తట్టల వ్యాపారాల జోరు పెరిగింది. తాజాగా, వరాహస్వామి, పాత అన్నప్రసాద కేంద్రం ప్రాంతాల్లో దాదాపు 20 తట్టలు ఏర్పాటు చేసుకునేందుకు రెవెన్యూ విభాగం అనుమతులు జారీ చేసినట్టు తెలిసింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వీరికి అనుమతి ఎవరిచ్చారు, ఎందుకు ఇచ్చారు అంటూ ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. తట్టల వ్యాపారం అదుపు తప్పితే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది.

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం రవాణా కేసులో నిందితునికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ ఫారెస్ట్ బీటు అధికారి ఖ్యాతి తెలిపిన వివరాల మేరకు ఎర్రావారిపాళెంకు చెందిన ఎస్.బాలసుబ్రహ్మణ్యం 2016లో తలకోన సెంట్రల్ బీట్ నుంచి ఐదు ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. ఈకేసు తొమ్మిదేళ్లుగా దర్యాప్తు దశలో ఉంది. తాజాగా ఏపీపీ బాలకృష్ణ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ ప్రదీప్‌చంద్, డీఆర్వో బాబుప్రసాద్‌లు న్యాయమూర్తి ఎదుట సాక్షాధారాలను నిరూపించారు. దీంతో మంగళవారం నిందితునికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు



రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల దుర్మరణం

● పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు ● మరో ఇద్దరికి గాయాలు







రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పద్మ - చికిత్స పొందుతూ మృతి చెందిన జశ్వంత్‌సాయి - గాయపడిన హేమలత

చంద్రగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తొండవాడ జాతీయ రహదారిలో పాల ట్యాంకర్‌ను కారు ఢీకొన్న దుర్ఘటలో తల్లి కొడుకు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు విజయవాడకు చెందిన కోటేశ్వరరావు, భార్య పద్మ(40), కుమారుడు జశ్వంత్‌సాయి(14), సోదరి హేమలతలు కారులో తిరుణామలైకు వెళ్లారు. ఈక్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కారు కోటేశ్వరరావు నడుపుతున్నారు. పక్క సీటులో కుమారుడు జశ్వంత్ సాయి, వెనుక సీటులో పద్మ, హేమలతలు కూర్చొన్నారు. తొండవాడ సమీపంలోని పూతలట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను వీరి కారు వేగంగా వెళ్తూ ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారు వేగంగా ఢీకొనడంతో బెలూన్‌లు కూడా ఓపెనయ్యాయి. పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. జశ్వంత్ సాయి, హేమలతలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన జశ్వంత్ సాయి, హేమలతలను స్థానికులు బయటకు తీశారు. వెంటనే అంబులెన్స్‌లో వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జశ్వంత్ సాయి మృతి చెందాడు. పద్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కోటేశ్వరరావు కోలుకుంటున్నారు. ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్ బాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నెలలుగా ఏం చేశావ్ జగన్?

● రైతులను ఆదుకోవాలంటే మీ నేతల ఫ్యాక్టరీల్లో రూ.12కి కొనిపించండి

● రైతు సంఘం నాయకుల సలహా

తిరుపతి(ఆటోనగర్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): 'రెండు నెలలుగా ఏం చేశావ్. ఇప్పుడు పంట వడిగి పోతున్న సమయంలో బంగారుపాళ్యం వచ్చి రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడటం వల్ల ఒరిగేది ఏమీ లేదు. రైతులను ఆదుకోవాలనుకుంటే.. జిల్లాలో మీ నేతలకే ఎక్కువ గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఇప్పటినుంచైనా వారిచేత రూ.12కు కొనిచ్చేలా ప్రకటన చేయండి' అంటూ టీడీపీ రైతు సంఘం నాయకులు సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం పి.నాగేశ్వర్ రాజు, శివకోటేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఈ ఏడాది అంచనాల కంటే లక్ష టన్నులు అదనంగా పంట వచ్చిందన్నారు. దీనిని గ్రహించే తాము మార్చి నుంచే మామిడి రైతులతో పలుదఫాలు చర్చలు జరిపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.ప్రభుత్వం స్పందించి టన్నుకు రూ.నాలుగు వేలు చెల్లించడానికి అంగీకరించిందన్నారు. అధికారులతో, గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో పదే పదే చర్చలు జరిపి మామిడి పంటను పూర్తిగా కొనేలా ఆదేశాలిచ్చారన్నారు. గత ఐదేళ్ళలో ముఖ్యమంత్రిగా వున్న మీరు రైతులకు చేసిన మేలు ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ రైతులను ఆదుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె.గోపీనాథ్ రెడ్డి, టి.ప్రకాష్ నాయుడు, పి.చిన్నారెడ్డి, కె.సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రైతు సంఘ నాయకులు



నల్లపరెడ్డిపై చర్యలేవీ జగన్?

● టీడీపీ నేతల నిరసన

తిరుపతి, జూలై8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన నీచ వ్యాఖ్యలపై జగన్‌రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమంటే మహిళలను అవమానించడమేనని టీడీపీ నేతలు మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం తిరుపతిలో నిరసన తెలిపారు. జగన్ రెడ్డి అండతోనే వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ విమర్శించారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రసన్నకుమార్‌రెడ్డి దిగజారుడు మాటలపై మహిళాలోకం ఆగ్రహంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, పాటకం వెంకటేష్, రామ్మూర్తి రాయల్, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, అనిత తదితరులు పాల్గొన్నారు.

గదులు కేటాయించే ఎంబీసీ వద్ద భక్తుల మధ్య ఘర్షణ

● విజయవాడ భక్తుడిపై రాళ్లు విసిరిన ఇంటర్ విద్యార్థి

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదులు కేటాయించే ఎంబీసీ34 వద్ద ఇద్దరు భక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో సహనం కోల్పోయిన ఓ ఇంటర్ విద్యార్థి రాళ్లు విసరడంతో విజయవాడకు చెందిన ఓ భక్తుడు గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన మోహన్‌కృష్ణ ఇంటర్ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చాడు. గది పొందేందుకు ఎంబీసీ34 కౌంటర్ వద్దకు వెళ్లారు. విజయవాడకు చెందిన రవిప్రసాద్ కూడా గది తీసుకునేందుకు ఎంబీసీ34కు చేరుకున్నాడు. క్యూలైన్‌లో రాకుండా రాంగ్‌రూట్‌లో వచ్చేడనే కారణంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటలు పెరిగి బూతులు తిట్టుకునే వరకు చేరుకోవడంతో సహనం కోల్పోయిన మోహన్‌కృష్ణ పక్కనే ఉన్న చిన్నపాటి రాళ్లతో రవిప్రసాద్‌పై విసిరాడు. దీంతో రవిప్రసాద్ ఛాతీపై చిన్నగాయమైంది. దీంతో అక్కడి ఉద్యోగులు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకునేలోగా మోహన్‌కృష్ణ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతడి స్నేహితుల ద్వారా పోలీసులు మోహన్‌కృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఘర్షణలకు పాల్పడితే ఆధార్ బ్లాక్ చేస్తాం

సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు తోటి భక్తులను ఇబ్బంది పెడుతూ త్వరితగతిన గదులు పొందాలని ప్రయత్నించినా.. ఘర్షణకు పాల్పడినా వారి ఆధార్ కార్డులను బ్లాక్ చేస్తామని టీటీడీ హెచ్చరించింది. ఎంబీసీ34 గదుల కేటాయింపు వద్ద భక్తుల మధ్య ఘర్షణ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఈ ప్రకటన చేసింది. 'భక్తుల రద్దీ సాధారణంగాఉంది. గదులు అందుబాటులోనే ఉన్నాయి. అయినా సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు సహనాన్ని కోల్పోయి ఘర్షణ వాతావరణం సృష్టించడం బాధాకరం. హిందూ ధార్మిక క్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత' అని ఆ ప్రకటనలో పేర్కొంది.


ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోండి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), జూలై 8(ఆంధ్రజ్యోతి): పీ4లో భాగంగా ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం వివిధ శాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ శనివారం లోపు ప్రతి రెవెన్యూ డివిజన్‌లో కనీసం 20మందికి తక్కువ కాకుండా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. తానూ కలెక్టరేట్ సమీపంలోని నక్కల కాలనీలో మూడు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇక అన్నదాత సుఖీభవ పథకం కింద 17వ తేదీన నగదు విడుదల చేయాలన్నారు. 1 నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు కలిసి ఈ నెల 10 జరిగే మెగా పేరెంట్స్ , టీచర్స్ మీటింగ్2.0ను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్‌లో సమస్యలకు గడువులోపు పరిష్కారం చూపకుంటే అందుకు వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తిరుపతి(ఆటోనగర్), జూలై8(ఆంధ్రజ్యోతి): పదేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయిలో బుధవారం కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు నిరసనలు తెలియ జేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధించి పాలకులకు కనువిప్పు కలిగేలా ఆందోళనలు చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.రామానాయుడు,శివరెడ్డి, పి.మురళి, సి.పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా.. సహకారమా?

● ఒకరి బీమా సొమ్ము మరొకరి ఖాతాకు జమలో అధికారుల పాత్ర ఎంత?

పెళ్లకూరు/నాయుడుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో బీమా తీసుకుంది ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లు. మెచ్యూర్ సొమ్ము జమైంది ఆరూరు సిద్దయ్య కుమారుడు వెంకటేశ్వర్లు బ్యాంకు అకౌంట్‌కు. వీరిద్దరికీ పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామమే. బంధువులే. ఇలా ఎల్ఐసీకి తప్పుడు బ్యాంకు ఖాతా వివరాలిచ్చి రూ.19.87 లక్షలు కాజేసిన ఘటనలో అధికారులది సహకారమా.. నిర్లక్ష్యమా అనేది తేలాల్సి ఉంది. బాధితుడికి వడ్డీసహా డబ్బులిస్తామని చెబుతున్న అధికారులు బాధ్యులపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పాలసీ మెచ్యూర్ సమయం ముగిసింది. ఈ రూ.19,87,500 లక్షలు రావాలి. మే నెల 9న తన బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్ తదితరు ధ్రువీకరణ పత్రాలను నాయుడుపేట ఎల్ఐసీ కార్యాలయంలో సమర్పించారు. జూన్ 27న ఆయన బ్యాంకు ఖాతాకు నగదు జమవుందని తెలిపారు. అయితే, జూలై ఒకటి వరకూ నగదు జమ కాకపోవడంతో ఆరూరు వెంకటేశ్వర్లు ఎల్ఐసీ కార్యాలయానికి వెళ్లి వాకబు చేశారు. తనకు జమ కావాల్సిన నగదు జూన్ ఆరో తేదీన తమ సమీప బంధువైన ఆరూరు సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు ఖాతాకు జమ చేసినట్లు తెలిసి కంగుతిన్నాడు. రెండు నెలలు కిందటే అన్ని వివరాలు ఇచ్చినా వేరే వారి ఖాతాకు ఎలా నగదు బదిలీ అయిందని నిలదీయగా, ఎక్కడ ఏం జరిగిందో తెలుసుకుని న్యాయం చేస్తామని నచ్చజెప్పినట్లు తెలిసింది. ఎల్ఐసీ అధికారుల విచారణలో సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పేరిట నాయుడుపేటలోని బ్యాంకు ఖాతాలో జమయినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఎల్ఐసీలోని కొంతమంది సిబ్బంది ద్వారా తన తండ్రి ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి సిద్దయ్య) ఆధార్, పాన్, మొబైల్ నెంబర్ల వివరాలను ఆరూరు జ్ఞానేంద్ర ఇచ్చి.. ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి వెంకటసుబ్బయ్య) ఎల్ఐసీ ఖాతాకు లింకు చేసినట్లు సమాచారం. తన తండ్రి ఖాతాలో జమయిన నగదును తన ఖాతాలోకి మార్చుకుని అనంతరం రూ.10 లక్షలు తన భార్య, రూ.9 లక్షలు తన అత్త పేరుమీద అతడు చాకచక్యంగా మార్చుకున్నట్లు తెలిసింది. నాయుడుపేట ఎల్ఐసీ అధికారులు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యాలయానికి వివరాలను తెలియజేశారు. ఇలా ఎల్ఐసీ అధికారులను బురిడీ కొట్టించిన వ్యక్తిని.. అతడికి సహకరించిన ఎల్ఐసీ సిబ్బందిపైనా ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాధితుడు వాపోయారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించి భవిష్యత్తులో మరొకరికి ఇలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నారు. కాగా, ఇందులోని బాధ్యులు.. బాధితుడి బ్యాంకు ఖాతాలో నగదు జమచేయించేలా చర్యలు చేపట్టినట్లు తెలిసింది. మరి, బాధ్యులపై ఎలాంటి చర్యలుంటాయో చూడాలి.

మూడు మార్గాల్లో 48 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకొని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-హిస్సార్‌ల మధ్య నడుస్తున్న వారాంతపు రైళ్లను సెప్టెంబరు వరకు పొడిగించింది. అలాగే కాచిగూడ-తిరుపతిల మధ్య 8 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. తిరువణ్ణామలైలో కొండ చుట్టూ తిగడానికి భక్తుల రద్దీ పెరగడంతో, నరసాపూర్ -తిరువణ్ణామలై మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

తిరుపతి-హిస్సార్‌ల మధ్య 24 వారాంతపు రైళ్లు

● తిరుపతి-హిస్సార్ మధ్య వారాంతపు రైళ్లను బుధవారం నుంచి సెప్టెంబరు 28 వరకు పొడిగించారు.తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07717) ప్రతి బుధవారం బయలుదేరి రెండవ రోజుకు హిస్సార్ చేరుకొంటుంది.హిస్సార్‌లో ఈ ప్రత్యేక రైలు (07718)ప్రతి ఆదివారం బయలుదేరి వచ్చిన మార్గంలోనే తిరుపతికి చేరుకుంటుంది.

కాచిగూడ -తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

● కాచిగూడలో ఈ నెల 10,17,24,31,తేదీల్లో ప్రతి గురువారం ఈ ప్రత్యేక రైలు(07653) బయలు దేరి మల్కాజ్‌గిరి, జనగాం, గూడూరు మీదుగా తిరుపతికి మరుసటి రోజుకు చేరుకొంటుంది. తిరుపతిలో ఈ నెల 11, 18, 26, ఆగస్టు1వ తేదీల్లో ఈ రైలు(07654) బయలుదేరుతుంది.

నరసాపూర్-తిరువణ్ణామలై మధ్య 16 ప్రత్యేక రైళ్లు

● నరసాపూర్‌లో ఈ నెల 9, 16, 23, ఆగస్టు6, 13, 20, సెప్టెంబరు 3, 24 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు (07219) బయలుదేరి విజయవాడ, తెనాలి, తిరుపతి, చిత్తూరు, వేలూరు మీదుగా మరుసటి రోజు తిరువణ్ణామలైకి చేరుకొంటుంది. తిరువణ్ణామలైలో ఈ నెల 10, 17, 24, ఆగస్టు 7, 14, 21, సెప్టెంబరు 4, 25 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు(07220) బయలుదేరి మరుసటి రోజు నరసాపూర్‌కు చేరుకుంటుంది.

16 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీ నియామకం

చిత్తూరు సెంట్రల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్‌ల)కు త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఒకరు చైర్మన్‌గా, ఇద్దరు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల కాలపరిమితి ఈనెల 30వ తేదీనాటికి ముగియనుంది. వీరి స్థానంలో త్రిసభ్య కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. పదవీ కాలం అక్టోబరు 30వ తేదీ వరకు.. లేకుంటే ఎన్నికలు నిర్వహించే వరకు ఉంటుంది.

కమిటీల వివరాలు

పీఏసీఎస్	సభ్యులు
కోసలనగరం	ఎం.బాబు యాదవ్ (చైర్మన్), ఎస్.వరదరాజులు, కె.మురళి
అగరంరామకృష్ణ	కె.బాబు నాయుడు (చైర్మన్) కె.వీరరాఘవులు, కె.రవినాయుడు
నింద్ర	పి.వెంకటేశ్వరరావు (చైర్మన్) కె.పెరుమాల్‌రెడ్డి, బి.శివలింగం
బయ్యప్పగారిపల్లె	జె.వెంకటమునిరెడ్డి (చైర్మన్) ఎస్.భాస్కర్, టి.వెంకటరామయ్య
భైరెడ్డిపల్లె	ఎస్.నాగరాజనాయుడు (చైర్మన్) ఎం.దివాకర్‌రెడ్డి, జి.విశ్వనాథ్
పుంగనూరు	పి.రమణ (చైర్మన్) ఇ.శ్రీనాథ్‌రెడ్డి, కె.వెంకటరమణ
సదుం	టి.సునీల్‌కుమార్‌రెడ్డి (చైర్మన్) ఎస్.నాగరాజు, కె.కృష్ణయ్య
పులిచెర్ల	ఎల్.ధనంజయనాయుడు (చైర్మన్) వి.జయకుమార్, ఆర్.గుర్రప్ప
చిన్నగొట్టిగల్లు	ఎం.ప్రభాకర్ (చైర్మన్) జి.శోభారాణి, పి.అలివేలమ్మ
చంద్రశేఖరపురం	బి.హేమచంద్ర నాయుడు (చైర్మన్) జి.దేవని, టి.హరిప్రసాద్
వి.కోట	ఎ.నారాయణస్వామి (చైర్మన్) సి.జయప్ప, ఎం.మూర్తి
ముదరందొడ్డి	సీఆర్ హరినాథ్‌రెడ్డి (చైర్మన్) రాధాకృష్ణ, ఎ.చిన్నప్ప
గంగవరం	ఎస్.ప్రసాద్ (చైర్మన్) కె.హరిబాబు, బి.శివరాంరెడ్డి
పెద్దపంజాణి	కె.శ్రీఅములు (చైర్‌పర్సన్) ఒ.గంగప్ప, పి.హరినాథ్
సోమల	పి.శివ శంకర్ (చైర్మన్) ఎస్.ఆరీఫ్ అలీ, ఎం.సతీష్
చౌడేపల్లె	పి.హరిప్రసాద్ (చైర్మన్) పి.ముని వెంకటరమణ, ఎం.సుబ్రహ్మణ్యరాజు

రాజకీయ లబ్ధి కోసమే జగన్ యాత్రలు, ఓదార్పులు

● ఎమ్మెల్యే భానుప్రకాష్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి యాత్రలు, ఓదార్పులు చేస్తున్నారని ఎమ్మెల్యే భానుప్రకాష్ విమర్శించారు. కాకవేడులో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పూర్తయ్యాక ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి రైతులకు ఏమి చేయడానికి బంగారుపాళ్యం వస్తున్నారని, గత ఐదేళ్లలో రైతులకు ఆయన చేసిందేమిటని ప్రశ్నించారు. నేడు మామిడి రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.300 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఒకప్పుడు రోజా రూ.2000 కోసం ఏపనైనా చేసేవారని, నేడు రెండు వేలకోట్లు ఎలా వచ్చాయో నగరి ప్రజలకు తెలుసన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మట్టి అమ్మకాల వీడియోలున్నాయని, ఆమె నేడు మట్టి తరలిస్తున్నారని అరవాల్సిన అవసరం లేదన్నారు. నేడు ఎక్కడైనా మట్టి అక్రమంగా తరలిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. కేవలం జాతీయ రహదారులకు మట్టిని తీసుకెళుతుంటే నోటికొచ్చినట్లు రోజా మాట్లాడటం సబబు కాదని, వయస్సు మీరాకైనా మంచిగా మసలుకోవాలని సూచించారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు

● అపోలో, ప్రభుత్వాస్పత్రి అధికారులతో సమావేశం


ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మెటర్నిటీ ఓపీని తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ ఇలా వచ్చి తనిఖీలు చేస్తున్నారని తెలిసి అపోలో, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి అధికారులు ఆయన్ను కలిశారు. అనంతరం చిన్నపిల్లల వార్డును తనిఖీ చేసి అక్కడి వైద్యులతో మాట్లాడారు. ఇన్‌పేషెంట్ వార్డులను, ఐసీయూలను తనిఖీచేశారు. అనంతరం అపోలో, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి కావాల్సి మందులు, మాత్రలు, ఇతర వస్తువులు, పరికరాలపై, మరమ్మతుకు గురైన భవనాల గురించి ఆరా తీశారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి ఏమేమి కావాలలో ఒక నివేదిక తయారుచేసుకొని బుధవారం తనను కలెక్టరేట్‌లో కలవాలని ఆదేశించారు. ఆయన వెంట చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎంఎస్ ఉషశ్రీ, అపోలో ఎంఎస్ రంగనాథ్, అపోలో ఏవో రాంగోపాల్ రెడ్డి, ఆర్ఎం సంధ్య తదితరులు పాల్గొన్నారు.



నేలకొరిగిన కొబ్బరి చెట్టు - ధ్వంసమైన మామిడి చెట్టు

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద పంటలపై ఏనుగుల మంద దాడులు ఆగడం లేదు. ఓ వైపు ఏనుగుల గుంపు.. మరోవైపు ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేస్తూ స్థానికులను భయాందోళనకు చేస్తున్నాయి. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బయల్దేరిన 15 ఏనుగుల మంద పాతపాళ్యం అడవి మీదుగా పాతపేట వద్దకు చేరుకున్నాయి. పాతపేటలోని రైతులు రమేష్, రామూర్తి, సుబ్రహ్మణ్యం, నాగరాజు, వెంకట్రమణ, జయచంద్ర, మునిరాజ, ఈశ్వర్‌రెడ్డి, శేఖర్, చంద్రశేఖర్‌కు చెందిన మామిడి, కొబ్బరి, అనప, పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. డ్రిప్ పైపులు, పిల్లర్లు, గేటువాల్వ్ విరిచేశాయి. మామిడితోటల్లో నానా బీభత్సం సృష్టించాయి. తర్వాత అడవిలోకి చేరుకున్నాయి. మరోవైపు గోగులమ్మ వంక నుంచే బయల్దేరిన ఒంటరి ఏనుగు.. కల్లూరు సమీపంలోని ఎద్దులవారిపల్లె వద్దకు చేరుకుంది.అక్కడినుంచి కల్లూరు-చిత్తూరు జాతీయ రహదారిని దాటుకుని కోటపల్లెలోని రైతు గోపికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. తర్వాత తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక వద్దకు చేరుకుంది. మంగళవారం పగలంతా 15ఏనుగుల గుంపు పశ్చిమ విభాగం అడవిలో, ఒంటరి ఏనుగు తూర్పు విభాగం అడవిలో తిష్ఠ వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

రేపు తిరుపతి గంగమ్మ ఆలయంలో చండీహోమం

తిరుపతి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా గురువారం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రాంగణంలో చండీహోమం నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు హోమం జరగనుంది. ఆసక్తిగల భక్తులు బుధవారం నుంచే ఆలయంలోని కౌంటర్ వద్ద వెయ్యి రూపాయలు చెల్లించి గోత్రనామం నమోదు చేసుకుని.. రశీదు పొందవచ్చు. హోమానికి హాజరయ్యే సమయంలో భక్తులు సంప్రదాయ దుస్తులతో రావాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 0877-2220766, 98886 66679 నెంబర్లను సంప్రదించాలని ఆలయ ఈవో జయకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వందశాతం రాయితీతో ఆయిల్‌పాం మొక్కలు

● జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

నింద్ర, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫాం సాగు చేసే రైతులకు వందశాతం రాయితీతో ఆయిల్ మొక్కలు అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నింద్రలో 3ఎఫ్ ఆయిల్ పాం ప్రైవేటులిమిటెడ్ జనరల్ మేనేజర్ విజయప్రసాద్, జోనల్ మేనేజర్ వెంకటమురళీ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌ఫాం సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం హెక్టారుకు రూ.29 వేలు విలువైన 143 మొక్కలను వందశాతం రాయితీపై ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అంతర్‌పంట సాగుకు హెక్టారుకు రూ.5250 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు మొత్తం రూ.21 వేలు రాయితీ ఇస్తుందన్నారు. అదనంగా చాఫ్ కట్టర్, వర్మీకంపోస్టు యూనిట్‌లు వైర్‌మెన్‌పై 50 శాతం రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌పై (10 ఎకరాల్లో రైతుకు) 90 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. అంతర పంట సాగుపై తక్కువ సమయంలో ఆదాయం లభిస్తుందని అన్నారు. చిత్తూరు జిల్లాలో నిర్వహించిన సర్వేలు ఆయిల్‌పాం సాగుకు అనుకూలమని గుర్తించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నింద్ర వ్యవసాయాధికారి తులసి, రైతులు నారాయణస్వామి నాయుడు, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వర్క్‌ఆర్డర్లను పూర్తిచేయండి

చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఏఈలను చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఆదేశించారు. మంగళవారం స్థానిక గాంధీరోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో ఈఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా వర్కుఆర్డర్లు పూర్తి కాని ఏఈలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓవర్‌లోడ్ ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురయ్యే అవకాశం ఉందని, వాటిని పరిశీలించి లోడ్ పెంచే ఏర్పాటు చేయాలన్నారు. ఏఈలు అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోపు బిల్లింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. 200 యూనిట్లు పైబడి వాడుతున్న వినియోగదారులను గుర్తించి పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈలు ఆనంద్, ప్రసాద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అలజడి సృష్టించేందుకే జగన్ పర్యటన : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అలజడి సృష్టించేందుకే మాజీ సీఎం జగన్ ప్రశాంతంగా ఉన్న బంగారుపాళ్యంలో పర్యటిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ విమర్శించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో ఏనాడూ రైతులను పట్టించుకోని జగన్‌కు రైతులను పరామర్శించే హక్కు లేదన్నారు. మామిడి రైతులకు ఏం మేలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బలప్రదర్శన చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికే రైతుల పరామర్శ పేరుతో వస్తున్నారని మండిపడ్డారు. జగన్ పర్యటన అంటేనే ప్రజలు భయపడుతున్నారన్నారు. ఆయన ఎక్కడ కాలుపెడితే అక్కడ విధ్వంసం, ప్రాణాలకు, ఆస్తులకు నష్టమేనని చెప్పారు. పరామర్శల పేరుతో జగన్ రాష్ట్రంలో ఇప్పటికే రెండుచోట్ల నానా హంగామా సృష్టించారని, తాజాగా బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించే నెపంతో మరో రాజకీయ కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు.


ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను జగన్ ఖండించకపోవడం సిగ్గుచేటు

చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత


మీడియాతో మాట్లాడుతున్న కటారి హేమలత

చిత్తూరు సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ సీఎం జగన్ ఖండించకపోవడం సిగ్గుచేటని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అశ్లీలపదజాలాన్ని ఖండించకుండా జగన్ మౌనంగా ఉండడం మహిళలను అవమానించడమేనని చెప్పారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం, అడుగడుగునా అవమానించే నీచ సంస్కృతిని పెంచి పోషిస్తున్నది జగన్‌రెడ్డేనని అన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన వైసీపీ నేతలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు వరలక్ష్మి, రాణి, అరుణ, సవిత తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



రామచంద్రాపురం: జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది. ఎన్‌ఆర్‌కమ్మపల్లి గ్రామ సమీప అడవి నుంచి పొలానికి నీటి దాహం తీర్చుకోవడానికి మంగళవారం మధ్యాహ్నం దుప్పి వచ్చింది. గమనించి కుక్కలు గుంపులుగా దాడిచేసి కరిచి చంపేశాయి. అటవీశాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం ఇచ్చారు. పశువైద్యాధికారి భువనేశ్వరి దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీట్ సెక్షన్ అధికారి తులసయ్య దీనిని ఖననం చేశారు.

స్కూటరిస్ట్ మృతి


మృతి చెందిన సుబ్రహ్మణ్యం

రామచంద్రాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి -పచ్చికాపల్లం ప్రధాన రహదారి గంగిరెడ్డిపల్లి మలుపు వద్ద మంగళవారం సాయంత్రం స్కూటరిస్టు అదుపు తప్పి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఆచారి(50) స్కూటర్‌పై మంగళవారం మధ్యాహ్నం బయలుదేరాడు. గంగిరెడ్డి మలుపు వద్ద స్కూటర్ అదుపుతప్పడంతో స్పృహ తప్పాడు. గ్రామస్థులు 108 ద్వారా తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నూతన భవనంలో 'డీఈఐసీ' ప్రారంభోత్సవం

అందుబాటులో అత్యాధునిక పరికరాలు



నూతన డీఈఐసీ భవనం - వినికిడిని పరీక్షించే అత్యాధునిక యంత్రం

చిత్తూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డీఈఐసీ) నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. వన్‌స్టాప్ సెంటర్ వద్ద ఈ కేంద్రాన్ని మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి ప్రాంభించనున్నట్లుగా డీఎంహెచ్‌వో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో 18 ఏళ్లలోపు పిల్లల ఆరోగ్య పరిస్థితులను గుర్తించి చికిత్స చేస్తారు. చిన్నారుల్లోని 4డీస్(డిఫెక్ట్, డీసీజెస్, డిఫార్మాటీస్, డెంలప్‌మెంట్) గమనించి.. వాటి ఆధారంగా వైద్య సేవలందించడం ఈ కేంద్రం ప్రత్యేకత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) కింద ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాయి. పీహెచ్‌సీల పరిధిలోని వైద్య సిబ్బంది జన్యులోపాలు, నూరల్ ట్యూబ్ లోపం, డౌన్ సిండ్రోమ్, గ్రహణం మొర్రి, వంకర పాదాలు, గుండె జబ్బులు, నడుము మీద కాయలు, వినికిడిలోపం, కంటి, దంత సమస్యలు, ఆటిజమ్, అంధత్వం, మానసిక వైకల్యం తదితర సమస్యలతో బాధపడుతున్న పిల్లల్ని గుర్తిస్తారు. వారిని డీఈఐసీ కేంద్రానికి ప్రత్యేక వాహనం ద్వారా పంపుతారు. వైద్యులతో పరీక్షలు చేయించి చికిత్స అందిస్తారు. ప్రతి ఆరు నెలలకోసారి సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులను గుర్తించి, వైద్యసేవలందేలా చూస్తారు.

లోపించిన ప్రచారం: ఇంతటి ప్రాధాన్యమున్న కేంద్రంపై ప్రచారం లోపించడం ప్రత్యేక అవసరాల పిల్లలకు శాపంగా మారింది. ఈ కేంద్రం ఉందనే విషయం చాలామందికి తెలియక వినియోగించుకోవడం లేదు.

సద్వినియోగం చేసుకోండి



జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో చిన్నారులకు అందజేసే వైద్యం పూర్తిగా ఉచితం. తల్లిదండ్రులు పుట్టిన నాటి నుంచే పిల్ల లోపాలు గమనించి ఈ కేంద్రానికి తీసుకొస్తే సంబంధిత వైద్యులు పరీక్షించి చికిత్స చేస్తారు. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతారు. బాధితులు సద్వినియోగం చేసుకోండి

- సుధారాణి, డీఎంహెచ్‌వో

మతిస్థిమితం లేని వ్యక్తుల నియంత్రణకు ప్రణాళిక

● ఎస్పీ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాల ఏర్పాటు

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం సైకో వీరంగంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరునగరిలో భిక్షగాళ్లు, మతిస్థిమితం లేని వ్యక్తులు, సైకోల ఏరివేతకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా తిరుపతి ఈస్ట్, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఉన్నారని పోలీసులు గుర్తించారు. వీరంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు. ఎక్కడ తల దాచుకుంటున్నారనేది పరిశీలించి ఎంఆర్‌పల్లెలోని బెగ్గర్ల షెల్టర్‌కు తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం తిరుపతిలో 60 నుంచి 70మంది భిక్షగాళ్లు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీరితో పాటు మతిస్థిమితం లేని వ్యక్తులున్నారు. వీరిని చట్ట ప్రకారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి ఆస్పత్రికి తరలించి వారి మానసిక స్థితిపై సర్టిఫికెట్ తీసుకున్నాక అవసరమైన వారిని వైజాగ్‌లోని ఆస్పత్రికి తరలించడానికి పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. మతిస్థిమితం లేని వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలని డీఎస్పీ భక్తవత్సలం విజ్ఞప్తి చేశారు.

మతిస్థిమితం లేకనే హత్య

తిరుపతి కపిలతీర్థం సమీపంలో సోమవారం కత్తి, కర్రతో వీరంగం సృష్టించి ఒకరి హత్యకు.. ఇద్దరు గాయపడటానికి కారణమైన వ్యక్తిని మంగళవారం రుయాస్పత్రికి తరలించారు. ఇతడిని పరీక్షించిన వైద్యులు.. మానసిక స్థిమితం లేదని నిర్ధారించారని అలిపిరి సీఐ రామ్‌కిషోర్ చెప్పారు. అతడిని బుధవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాలతో వైజాగ్‌లోని మెంటల్ ఆస్పత్రికి తరలించనున్నామన్నారు.

బిచ్చగాడిని చంపిన మరో బిచ్చగాడు

చిత్తూరు అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బిచ్చగాడిని మరో బిచ్చగాడు రాడ్డుతో కొట్టి చంపిన సంఘటన చిత్తూరు నగరంలో చోటు చేసుకుంది. ఒకటవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లె మండలం అరగొండకు చెందిన లోకేష్, జీడీ నెల్లూరు మండలం కోటాగరానికి చెందిన దివ్యాంగుడైన రాజేంద్రలు నగరంలో వివిధ ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పోస్టాఫీసు వీధికి ఎదురుగా ఉన్న క్రాంతి ఫొటో స్టూడియో పక్కనే టీ దుకాణం వద్దకు ఇద్దరు చేరుకున్నారు. ఈ సమయంలో ఇద్దరికీ మాటామాట పెరిగడంతో ఆగ్రహానికి గురైన లోకేష్ పక్కనే ఉన్న రాడ్డుతో రాజేంద్ర తలపై బాదాడు. దాంతో రాజేంద్ర అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి: జడ్పీ సీఈవో

రేణిగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చేతుల్లో ఉందని ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్ చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై జరిగిన ఒక రోజు శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుస్థిర అభి వృద్ధి లక్ష్యాలు వైపు ప్రతి పంచాయతీని తీసు కెళ్లాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్రకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభు రావు, ఏవో పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మండలాలకు తెలుగుగంగ నుంచి నీటి సరఫరాకు ఖర్చు చేసిన రికార్డులను జడ్పీ సీఈవో పరిశీలించారు. 2023-24 సంవత్సరానికి మంజూరైన రూ.50 లక్షలకు సంబంధించి నీటి సరఫరా ఖర్చులను పరిశీలించారు. అనంతరం రేణిగుంట జనాభా ప్రకారం తెలుగుగంగ నీటిని ఎంత వినియోగిస్తున్నారని ఆరా తీశారు. ఎక్కువ మొ త్తంలో వినియోగిస్తున్నట్టు తేల డంతో మీటరు ఏర్పాటు చేయా లని ఆదేశించారు. పీఆర్ ఏఈ రమణ, కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786 9703618705, 9703618710 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF SURNAME

I, Konaki Sai Krishna (Old Name) S/o Konanki Rangaiah , R/o. Kuppavaripalli, Seetharamapuram, Rajampet, Annamayya Dt. Ap-516126. I Changed My Surname To KONANKI SAI KRISHNA (New Name) S/o Konanki Rangaiah. Henceforth I Will Be Known As Konanki Sai Krishna (New Name)

AJT - 1419

CHANGE OF SURNAME

I, THIRUVEEDI VENKATA SUBBA RAO (Old Name) S/o Late SUBBARAYUDU R/o D.NO:13/123-5, Raja Street, East Gudur, GUDUR - 524101, TIRUPATI DIST, ANDHRA PRADESH. I Changed my name to THIRUVEEDHI VENKATA SUBBARAO (New Name). Henceforth, I will be known as THIRUVEEDHI VENKATA SUBBARAO.

AJT - 1415

CHANGE OF NAME

I, VYAKARANAM CHANDRAADITYA BHARADWAJA (Old Name), S/o. VYAKARANAM VENKATA SUBRAMANYA RAMACHANDRA MURTHY, R/o. PLOT No. 205, Balaji Empire Apartment, Beside RK Hyundai Lane, Korramenugunta, Renigunta Road, Tirupati Urban-517501, Tirupati District, Andhra Pradesh.Changed my name to VYAKARANAM VENKATA CHANDRADITYA. Henceforth, I will be known as VYAKARANAM VENKATA CHANDRADITYA.

AJT - 1416

CHANGE OF NAME

I, KANDUKURI BHRAMARAMBA (Old Name), W/o. VYAKARANAM VENKATA SUBRAMANYA RAMACHANDRA MURTHY, R/o. PLOT No 205, Balaji Empire Apartment, Beside RK Hyundai Lane, Korramenugunta, Renigunta Road, Tirupati Urban -517501, Tirupati District, Andhra Pradesh. I Changed my name to VYAKARANAM BHRAMARAMBA. Henceforth, I will be known as VYAKARANAM BHRAMARAMBA.

AJT - 1417

FLAT FOR SALE

తిరుపతి ఖాదీ కాలనీ, ప్రకాశం పార్క్ వద్ద, 2 BHK ఫ్లాట్ 3వ ఫ్లోర్, North-East fully furnished flat 1030 sq.ft. very prime location, No Car Parking for Sale. Cont. : 83100 28673, 97400 01894

AJT - 1404

HEALTH CARE

శ్రీవిష్ణు చిన్న పిల్లల హాస్పిటల్: Dr.K.కీర్తన గారిచే పుట్టిన బిడ్డల & చిన్నపిల్లల వైద్యనిపుణులు 24x7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ పక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ తిరుపతి. సంప్ర: 63035 53359

AJT - 1418

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 237899

PLOT FOR SALE

తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డు, రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. వివరములకు, సెల్ : 95154 83527

AJT - 1403

PLOTS FOR SALE

జోష్ ప్రాపర్టీస్ ద్వారకామయి 4 వెంకటగిరి రోడ్, 300 ఎకరాలలో అప్పాచి షూ కంపెనీ ఎదురుగా 22 ఎకరాల తుడ అప్రూవల్ ప్లాట్స్ అతి తక్కువ ధరలో అమ్మబడును. మార్కెటింగ్ సిబ్బంది కావలెను. ఫోన్ : + 91 94942 08717

AJT - 1409

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



భారతమాత చిత్రపటానికి పూజలు చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, ఏబీవీపీ విద్యార్థులు

పలమనేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన ద్వారం వద్ద భారతమాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, బీజేపీ రూరల్ నాయకులు శరవణ కుమార్ మాట్లాడుతూ విద్యారంగంలోను, దేశభక్తి చాటడంలో ఏబీవీపీ పాత్ర చాలా కీలకమైందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంఘ అధ్యక్షులు పళని, విద్యార్థి సంఘ నాయకులు ఉమామహేష్, జగన్నాథం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రైతు కిసాన్ సంఘానికి డ్రోన్ అందజేత



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం పెంగరగుంట గ్రామంలోని జై హనుమాన్ కిసాన్ గ్రూపునకు మంగళవారం సుమారు రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్ ను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకంతో మండలానికి ఓ డ్రోన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ డ్రోన్ కు 80 శాతం సబ్సిడీ ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ డ్రోన్‌తో పది నిమిషాల వ్యవధిలో ఎకరా విస్తీర్ణంలోని కూరగాయల పంటకు క్రిమి సంహారక మందులను పిచికారీ చేయొచ్చన్నారు. డ్రోన్ 10 లీటర్ల సామర్థ్యం కలిగి ఉంటుందని.. రైతులకు కూలీల ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని ఏవో సంధ్య తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మడల నాయకులు నాగరాజరెడ్డి, వెంకటమునిరెడ్డి, జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, పలువురు రైతులు పాల్గొన్నారు.

కుప్పం ప్రజలకు అందుబాటులో రైళ్లను తీసుకురావాలి



డీఆర్ఎంను కలిసిన తులసీనాథ్ తదితరులు

కుప్పం, జులై 8 (ఆంధ్రజ్యోతి): వివిధ రైళ్లను కుప్పం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి తులసీనాథ్, నాయకులు వడివేలు, శ్రీధర్ బెంగళూరు డివిజన్ సౌత్ వెస్ట్రన్ రైల్వే మేనేజరు చైతన్య కృష్ణకు విన్నవించారు. బెంగళూరులో మంగళవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తులసీనాథ్ మాట్లాడుతూ బెంగళూరు నుంచి కుప్పం మీదుగా విజయవాడకు వందే భారత్ రైలుతోపాటు బెంగళూరుకు పుష్పుల్ అదనపు ట్రిప్ పొడించాలని కోరారు. బెంగళూరు నుంచి కుప్పం మీదుగా చెన్నైకి రాకపోకలు సాగిస్తున్న వందే భారత్ రైలుకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వాలన్నారు. అలాగే బెంగళూరు - విశాఖపట్టణం వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును రోజూ నడిచేలా చేయాలని కోరారు. రాష్ట్ర రాజధాని అమరావతి వెళ్లేందుకు వీలుగా వందే భారత్ రైలును విజయవాడ వరకు పొడించాలన్నారు. ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన డీఆర్ఎం చైతన్య కృష్ణ మాట్లాడుతూ వారి వినతులపై పరిశీలించి చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ



బాధిత రైతులకు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

గుడుపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన ఎనిమిది మంది రైతులకు రూ.49 వేలు నష్టపరిహారం చెక్కులను మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు, కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్, నేతలు బాబునాయుడు, బేటప్పనాయుడు, హేమంబరగౌడు, సుబ్బు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మంగళంపేటలో పర్యటించిన వైద్య బృందం

కల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ గురువిజయ్ తెలిపారు. పులిచెర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మంగళంపేటలో మంగళవారం ఆరోగ్య సేవల నాణ్యతపై తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల వైద్యుల బృందం పర్యటించింది. ఇంటింటికి వెళ్లి బరువు, ఎత్తు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. పులిచెర్ల వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బల ప్రదర్శనలు చేపడితే చర్యలు



గంగవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగన్ పర్యటన సందర్భంగా ఎవరైనా అనుమతి లేని వాహనాలు, బలప్రదర్శనలకు దిగితే చట్టపరంగా చర్యలు తప్పవని గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం అయన గంగవరం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ బంగారుపాళ్యం పర్యటనకు జిల్లా పోలీసు అధికారులు సూచించిన మేరకే ఉండాలనే ఉద్దేశంతో మండలం నుంచి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, మండలంలోని 11 మంది నాయకులకు బంగారుపాళ్యం వెళ్లరాదని నోటీసులు జారీచేశామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాల్లో జెండాలతో నినాదాలు చేసినా, బల ప్రదర్శనలకు దిగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

PUNGANUR MUNICIPALITY

'e' Procurement Tender Notice

Roc No.:157/2025/E1 Dt: 08-07-2025

Nit No: 1 to 17/2025-26

1.	No. of Works	: 17 Nos.
2.	ECV Amount	: Rs. 39.53 Lakhs
3.	Bid Document Downloading Starting Date	: 08-07-2025 at 05-30 P.M.
4.	Bid Document Downloading End Date	: 23-07-2025 at 03.30 P.M.
5.	Bid Submission Closing Date	: 23-07-2025 at 04.30 P.M.
6.	Commercial Bid Opening Date	: 23-07-2025 at 04.31 P.M.
	Name & Address of the Concerned Officer	: Commissioner, Punganur Municipality, Cell : 98499 05868

Further details can be seen at e-procurement market place at https://tender.apeprocurement.gov.in from 08-07-2025 at 5-30 P.M.

Sd/- Commissioner, Punganur Municipality

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు



వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని 100 పడకల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో భవాని సూచించారు. మంగళవారం ఆర్డీవో ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం వార్డులో చికిత్సలు పొందుతున్న రోగులను కలిసి వైద్యులు, వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్వహణ బాగుందని ఆర్డీవో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, డాక్టర్ యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పెన్షనర్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు

కుప్పం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పింఛనుదారుల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీజీ సెల్వం, కె.గణేశ్ పిళ్లై తెలిపారు. కుప్పం పట్టణంలోని ఎన్జీవో హోంలో ఉదయం 10 గంటలకు అనుభవం గల వైద్యులచే ఉచితంగా మధుమేహ పరీక్షలు చేయడంతోపాటు ఇతర వైద్య సేవలు, సలహాలు, సూచనలు పొందొచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లుసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు గురు పౌర్ణమి వేడుకలు

కుప్పం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డులో వెలసిన షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి హోమం, సుదర్శన హోమం, మృత్యుంజయ హోమం, హయగ్రీవవ హోమం, ధన్వంతరి హోమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సాయిబాబాతోపాటు ఆలయంలోని దేవతామూర్తులకు క్షీరాభిషేకం చేస్తామన్నారు. ఇందుకోసం పాలు ఇవ్వదలచిన వారు ఉదయం 8 గంటల లోపు ఆలయం ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల మధ్య మంగళ హారతి, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం షిరిడి సాయిబాబా ప్రాకారోత్సవం కనుల పండువగా చేస్తామని తెలిపారు.

● **రామకుప్పం:** రామకుప్పం పట్టణం ఆర్యవైశ్యవీధిలోని షిర్డీసాయిబాబా మందిరంలో ఈనెల 10న గురుపౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సాయిబాబా పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు భక్తుల స్వహస్తాలతో సాయిబాబా మూలవిగ్రహానికి పాలాభిషేకం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులు బ్యాంకు ఖాతాలు తెరవాలి

పలమనేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న షెడ్యూలు కులాలకు చెందిన విద్యార్థులు తల్లికి వందనం పథకం కోసం వెంటనే బ్యాంకు ఖాతాలను తెరవాలని పలమనేరు వెల్ఫేర్ అధికారిణి హైమావతి కోరారు. సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఖాతాలను ప్రారంభించాలని కోరారు. బ్యాంకు ఖాతా లేని వారు పోస్టల్‌లో ఖాతాను తెరచి ఎన్‌పీసీఐకి అనుసంధానం చేసుకోవాలని కోరారు.

సుస్థిర అభివృద్ధికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ

బైరెడ్డిపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికిగాను అన్నిశాఖలు సమష్టిగా కృషిచేయాలని బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక అనే అంశంపై అన్నిశాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, వైద్యసిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఆనంద్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, ఏఈ లోకనాథం, పశువైద్యాధికారి డాక్టర్ వెంకటసాయి, వ్యవసాయాధికారి గీతాకుమారి, రీసోర్సుపర్సన్లు ప్రభుదాస్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** పంచాయతీల్లో జరిగే అభివృద్ధిపై గ్రేడింగ్ పాయింట్లు ఆధారంగా నిధులు మంజూరు చేయనున్నట్లు పుంగనూరు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యదర్శులకు నరసింహులు, సందీప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, భౌతికశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులను బోధించడానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8712625057 ను సంప్రదించాలని కోరారు.

సమస్యలు తలెత్తితే వైసీపీ నాయకులదే బాధ్యత

సదుం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ బంగారుపాళ్యం పర్యటనలో సమస్యలు తలెత్తితే వైసీపీ నాయకులు, కార్యకర్తలదే బాధ్యత అని సదుం ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మాజీ సీఎం పర్యటనకు మండలం నుంచి ముఖ్యమైన నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లాలన్నారు. అధిక వాహనాల ప్రదర్శనలు చేపట్టరాదని సూచించారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

కుప్పం మండలానికి రూ.2.79 కోట్ల మంజూరు



కుప్పం: కొబ్బరి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, ప్రేమ్‌కుమార్ తదితరులు



రామకుప్పం: మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, అధికారులు

కుప్పం/కుప్పం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద రూ.2.79 కోట్లను కేటాయించింది. దీని ద్వారా మండలంలోని 214 మంది రైతులు లబ్ధి పొందుతారు. మండలంలోని గోనుగూరు గ్రామంలో మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు ప్రారంభించారు. రైతు బయ్యప్పకు చెందిన 1.75 ఎకరాల పొలంలో 105 కొబ్బరి మొక్కలను నాటించారు. ఇందుకోసం ఆ రైతుకు రూ.1.75 లక్షలు ఉపాధి హామీ పథకం కింద మంజూరైంది. కార్యక్రమంలో ఉపాధి హామీ అడిషనల్ పీడీ మల్లికార్జున, ఈవోఆర్డీ రమ్య, ఏపీవో హరి, సిబ్బంది, నాయకులు శ్రీనివాసులు, మహేంద్ర, శరవణ, సంతోష్, పార్థసారథి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** పండ్ల తోటల పెంపకం చేపట్టే రైతులకు ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. మంగళవారం రామకుప్పం మండల పరిధి చెల్దిగానిపల్లెలో ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యాన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీవో గణేష్, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, వెంకటరమణ, బాలరాజు, జ్ఞానశేఖర్ రెడ్డి, రెడ్డిపురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** పండ్లతోటల పెంపకంతో రైతులు ఆదాయ వనరులను పెంచుకోవాలని పుంగనూరు టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన మండలపార్టీ అధ్యక్షుడు విరూపాక్షి కోరారు. మంగళవారం మండలంలోని భీమగానిపల్లె సమీపంలోని కృష్ణప్ప వ్యవసాయ పొలంలో మామిడి మొక్కలను నాటారు. ఎంపీడీవో లీలామాధవి, ఏపీవో శివకుమార్, టీడీపీ నాయకులు గంగాధర్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు మండలం భీమగానిపల్లెలో..

రాష్ట్రంలో సంక్షేమం.. అభివృద్ధికే తొలి ప్రాధాన్యం



కుప్పంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, రాజ్‌కుమార్



పలమనేరు : ముదివారిపల్లిలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



సోమల: పెద్దఉప్పరపల్లెలో కరపత్రాలు అందజేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

సోమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం.. అభివృద్ధికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పెద్దఉప్పరపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి అభివృద్ధిని వివరించే కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలపై వినతులు స్వీకరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, రమేశ్‌నాయుడు, వేణుగోపాల్ నాయుడు, హరిప్రసాద్, ఉయ్యాల రమణ, శివశంకర్, మహేంద్రబాబు, సతీశ్, మోహన్‌నాయుడు, అష్రఫ్అలీ, రఫీ, పెద్ద రెడ్డెప్ప, బాలాజీ నాయుడు, పి.శ్రీనివాసులు, బాలకృష్ణమనాయుడు, ధర్మయ్యనాయుడు, సుబ్బరాయుడు, చాణుక్య, మల్లికార్జున, వెంకటరత్నం, సూరిశెట్టి సుధాకర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం** : రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు మెచ్చేలా సీఎం చంద్రబాబు పరిపాలన చేస్తున్నారని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధి చెల్దిగానిపల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, పురుషోత్తం, వెంకటాచలం, చంద్రకుమార్, రమేష్, రవి, ఉదయ్, దయాకర్, వెంకటాచలం, బాలరాజు పాల్గొన్నారు.

● **కుప్పం:** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అధినేత చంద్రబాబునాయుడు పిలుపు మేరకు మంగళవారం కుప్పం పురపాలక సంఘం 161, 162 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ , టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ ఇన్‌చార్జి రాజ్ కుమార్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పలమనేరు:** రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం పలమనేరు మండలం ముదివారిపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటంటికి పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలమనేరు రూరల్ టీడీపీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు వెంకటమునిరెడ్డి, పెద్దబ్బ, జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

● **శాంతిపురం:** బడుగుమాకులపల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు విశ్వనాథనాయుడు, విజయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, నేతలు జయరామిరెడ్డి, శివశంకర్, ఏఎంసీనాగరాజు, సింగిరి శ్రీనివాసులు, ఆంజనేయ రెడ్డి, కేశవులు, మురళి, మంజునాథ్, కేదార్‌నాథ్, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

● **గుడుపల్లె:** గుడుపల్లెలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని ఇంటింటా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు సురేష్‌బాబు, బాబునాయుడు, హేమాంబరగౌడు, బేటప్పనాయుడు, సుబ్బు, బాలాజీ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

37 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కంటి ఆపరేషన్లకు 37 మంది ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ జిల్లా హెల్త్ క్యాంప్ చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో పుంగనూరు, మదనపల్లె లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 37 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గౌతమ్‌రెడ్డి, అప్పినపల్లె భాస్కరాచారి, బాలసుబ్రహ్మణ్యం, రఘుపతి, కేశవరెడ్డి, మహేంద్రరెడ్డి, అమరావతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆశ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సదుం, జూలై 8(ఆంధ్రజ్యోతి): గర్భిణులపై ఆశ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని చెరుకువారిపల్లె వీహెచ్‌సీ వైద్యాధికారిణి గాయత్రి సూచించారు. మంగళవారం ఆశ డే కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణ సిబ్బంది జానకి, నీలకంఠ, శిఖామణి, ఆరోగ్య కార్యకర్తలు హేమలత, సరస్వతి, నాగరత్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ మనీషా, జానకి, శివాని, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



పలమనేరులో నివాళులర్పిస్తున్న వెంకటేగౌడ

కల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం నిర్వహించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు నాధమునిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పలమనేరు:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో పలమనేరు, కొలమాసనపల్లెల్లో ఘనంగా నిర్వహించారు.

● **పుంగనూరు:** వైఎస్ఆర్ జయంతి వేడుకలను పుంగనూరులో వైసీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప , మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వైసీపీ నాయకులు నాగభూషణం, చంద్రారెడ్డి యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, రమణ, షరీఫ్, రాజేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ..

● **ముగ్గురికి గాయాలు**



గాయపడ్డ రమేష్

చౌడేపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... పీలేరుకు చెందిన రమేష్ ద్విచక్రవాహనంలో పుంగనూరు వైపునకు వెళుతుండగా దేవరకురప్పల్లెకు చెందిన తండ్రీకొడుకులు అక్కుల్‌రెడ్డి, మాధవరెడ్డి చౌడేపల్లెలో సొంత పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరారు. ఈక్రమంలో మార్గంమధ్యలోని అమినిగుంట సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో అక్కుల్‌రెడ్డి తన ద్విచక్రవాహనానికి పెట్రోల్ పట్టించుకొని తిరుపతి రోడ్డువైపు బయలు దేరారు. ప్రధాన రహదారిలోకి వెళ్తున్న అక్కుల్‌రెడ్డి ద్విచక్రవాహనం, పుంగనూరు వైపునకు వెళ్తున్న రమేష్ ద్విచక్రవానాలు రెండు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. రమేష్‌కి తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అన్నదానానికి రూ.35 వేల విరాళం



దాతలకు తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయ అర్చకులు

చౌడేపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల అన్నదానం కోసం రూ.35 వేలు విరాళంగా అమ్మవారి భక్తులు ఇచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన అమ్మవారి భక్తులు రామోజీగౌడ్, మంజుల దంపతులు రూ.25 వేలు, మదనపల్లెకు చెందిన మాధవరెడ్డి, రాధారాణి దంపతులు రూ.10 వేలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సుపరిపాలనలోనే ప్రజలకు స్వేచ్ఛ

● ఎమ్మెల్యే భానుప్రకాష్



కాకవేడులో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో భయం గుప్పిట్లో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవించిన ప్రజలు నేడు సుపరిపాలనలో స్వేచ్ఛా స్వాతంత్రాల మధ్య జీవిస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి మున్సిపాలిటీలోని కాకవేడులో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు తల్లికి వందనం పథకం అమలు చేసినందుకు, ముఖ్యమంత్రి, విద్యాశాఖామంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్ల కార్డులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించి, కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, తహశీల్దార్ రవికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు గుణశేఖర్, తిరుమల నాయుడు, లోకేష్, జ్యోతి నాయుడు, మదివాసన్, జ్యోతి నాయుడు, ఎం.వి.శ్రీనివాసులు, శ్రీధర్, ఎం.వి.బాబు, సలీమ్, జావీద్, పలువురు టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'తల్లికివందనం' పిల్లలకు వరం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



పశుమందలో ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): తల్లి వందనం పథకం పిల్లల జీవితాలకు వరంలాంటిదని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కమ్మతిమ్మాపల్లె, కుప్పిగానిపల్లె, కిష్టజిమ్మాపురం, వసంతాపురం పంచాయతీల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్మన్ కటారిహేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీలు బాలాజీ నాయుడు, సుమతి, నాయకులు దినకర్, మధుసూదన్ నాయుడు, బలరామ్, రఘునాథ నాయుడు, రంగారెడ్డి, బాబురెడ్డి, జయదేవ నాయుడు, ఉదయ పాల్గొన్నారు.

ఆడపిల్లలు సురక్షితంగా ఉండాలి



ఆడపిల్లల సంరక్షణపై హితబోధ చేస్తున్న బాలచంద్రస్వామి

చిత్తూరు సెంట్రల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ఆడపిల్లలు సురక్షితంగా ఉండాలని 'అభయ-భవిత' వ్యవస్థాపకులు సీఎస్ బాలచంద్ర స్వామి విద్యార్థులకు హితబోధ చేశారు. మంగళవారం స్థానిక బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో ప్రిన్సిపాల్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ అధ్యక్షతన జీవితం మనదే.. జీవనం మనదే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అభయ-భవిత వ్యవస్థాపకులు బాలచంద్రస్వామి ఆడపిల్లలు సురక్షితంగా జీవించడానికి పలు సూత్రాలు పాటించాలన్నారు. ఇంటిలో తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆడబిడ్డల జీవితాలకు సూచించే మార్గదర్శకాలు పాటించాలన్నారు. జీవితంలో ఎదిగి స్థిరపడే వరకు వీరి నీడలోనే ఉంటూ బంగారు జీవితం సొంతం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా కోదండరాముడి ఊరేగింపు



హనుమంత వాహనంపై విహరిస్తున్న కోదండరాముడు

తవణంపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షికబ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు హనుమంత వాహనంపై వైభవంగా ఊరేగారు. అర్చకులు ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉంజల్‌సేవ నిర్వహించి హనుమంత వాహనంపై మేళతాళాల నడుమ టి.పుత్తూరు పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులు, టి.పుత్తూరు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



12 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందికి జడ్జి ఉమాదేవి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. గత రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందిని బుధవారం జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. కేసును పరిశీలించిన జడ్జి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున 12 మందికి రూ.1.20 లక్షల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

వెదురుకుప్పం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

బంగారమ్మకు ...



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు విశేష పూజలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమలతో అభిషేకం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించాచగా, భక్తులు దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త ప్రసాద్ పర్యవేక్షించారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల...



నందీశ్వరుడు

వెదురుకుప్పం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్య వల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష కాలం పూజలు చేశారు. స్వామికి అభిషేక పూజలతో పాటు నందీశ్వరుడికి ప్రదోష కాలం పూజలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కోదండపాణి సహా నిర్వాహకులు పర్యవేక్షించారు.

● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి, నందీశ్వరుడికి ప్రదోష పూజలు ఏకకాలంలో చేశారు. ప్రధాన అర్చకులు టంగుటూరి రవిశర్మ విశేష పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

ఉనికి కోసమే జగన్ తంటాలు



రాజేష్‌రెడ్డి

ఐరాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తన ఉనికిని చాటుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని బంగారుపాళ్యం ఆత్మ మాజీ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి తన బల ప్రదర్శన కోసం పది వేల మందితో బంగారుపాళ్యంలో మామిడి రైతుల కోసం విచ్చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలో ఉన్న మామిడి పంట గురించి పట్టించుకోని ఆయన బంగారుపాళ్యం విచ్చేయడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి మామిడి పంట గురించి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ కసరత్తు చేసి మామిడి బోర్డు గురించి అసెంబ్లీలో ఎలుగెత్తారని అన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోండి

పాలసముద్రం, జూలై 8(ఆంధజ్యోతి): మండలంలోని పంచాయతీల అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో సతీష్ కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి స్థానికంగా వనరులను ఉపయోగించుకోవడం, ఖర్చులను తగ్గించి ప్రభుత్వం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, డీటీ రిషివర్మ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రజలను చైతన్యపరచాలి



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా టీబీ అధికారి

గుడిపాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల గ్రామాలలో ప్రజలను చైతన్యపరచవలసిన బాధ్యత ఆశా వర్కర్లపై ఉందని జిల్లా టీబీ నివారణ అధికారి వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో రక్త హీనతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పలు రికార్డులను తనిఖీచేశారు. వైద్యాధికారి సంధ్య, సీహెచ్‌వో సూర్యనారాయణ, సిబ్బంది విజయ, త్రిలోక్, చంద్ర పాల్గొన్నారు.


చదువులో పోటీతత్వం ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దాత పద్మజ

గుడిపాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతి విద్యార్థికి పోటీతత్వం ఉండాలని శ్రీరంగంపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం మధు, దాత పద్మజ అన్నారు. మంగళవారం శ్రీరంగంపల్లె హైస్కూల్‌లో 2024-25 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు అందించారు. మహేష్, స్వప్న ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నగదు అందించారు. ద్వితీయ బహుమతిగా లక్ష్మీ, అక్షితకు రూ.5,000 అందించారు. కార్యక్రమంలో కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీ నివారణ ప్రతిఒక్కరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది

శ్రీరంగరాజపురం, జూలై 8 (ఆంధ్ర జ్యోతి): డెంగీ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఎస్ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో డెంగీ మాస ఉత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జర్వాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి షమామ్, సబ్ యూనిట్ అధికారులు భానుప్రకాష్, మోహన్‌బాబు, పర్యవేక్షక సిబ్బంది గంగాదేవి, తిరుమలయ్య, శ్రీనివాసులురెడ్డి, పద్మజ పాల్గొన్నారు.

'ఉపాధి'తో పండ్ల తోటలను విరివిగా పెంచండి

● డ్వామా పీడీ రవికుమార్



శ్రీకావేరిరాజుపురంలో మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ రవికుమార్

పాలసముద్రం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు విరివిగా పండ్ల తోటను పెంచాలని డ్వామా పీడీ రవికుమార్ రైతులను కోరారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురంలో కొబ్బరి, మామిడి మొక్కలునాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జామ, అల్లి నేరేడు, డ్రాగన్‌ఫ్రూట్స్ వంటి పండ్ల తోటలకు ఉపాధిహామీ పథకం వర్తిస్తుందన్నారు. రైతులు పండ్ల తోటలను పెంచి నికర ఆదాయం పొందాలన్నారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో పని చేసే కూలీల సంఖ్య తగ్గిపోవడం పట్ల సిబ్బందిని ఆయన మందలించారు. గత ఆర్థిక సంవత్సరంలో 92 వేల మంది కూలీలు పనిచేయగా ఈ సంవత్సరం 60 వేల మంది పనిచేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, జడ్పీటీసీ అన్బు, సర్పంచ్ మహేష్ నాయుడు, ఏఈవో మార్గరెట్, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు అరుళ్‌నాథన్, సాంబశివనః, రైతులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తూగుండ్రం హైస్కూల్‌కు గుర్తింపు తేవాలి

● సెల్‌కాన్ మొబైల్స్ ఎండీ గురుస్వామి నాయుడు



నీలిమకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న గురుస్వామినాయుడు

గంగాధరనెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో పోటీతత్వంతో రాణిస్తూ టెన్త్ పరీక్షల్లో ఉత్తమమార్కులు సాధించి జిల్లా, రాష్ట్రస్థాయిలో తూగుండ్రం హైస్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సెల్‌కాన్ మొబైల్స్ కంపెనీ ఎండీ ఎర్రగుంట్ల గురుస్వామి నాయుడు పిలుపునిచ్చారు. తూగుండ్రం హైస్కూల్లో 2024-25 విద్యాసంవత్సరంలో టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులతో ప్రథమస్థానంలో రాణించిన నీలిమకు రూ.20వేలు, ద్వితీయస్థానంలో రాణించిన పూజ, రక్షితలకు ఒక్కొక్కరికి రూ.10వేలు, తృతీయ స్థానంలో రాణించిన హిమబిందుకు రూ.10వేలును ప్రోత్సాహక నగదుగా వారి బ్యాంక్ ఖాతాలకు అందజేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, యంప్రాల వెంకటేశులు నాయుడు, హెచ్ఎం, టీచర్లు, టీడీపీనేతలతో కలిసి గురుస్వామి నాయుడు ఆ విద్యార్థినులను అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. హెచ్ఎం రాజేంద్రనాయుడు, సింగిల్‌విండో మాజీ వైస్ ఛైర్మన్ బాబు నాయుడు, హైస్కూల్ విద్యాకమిటీ ఛైర్మన్ సుధాకరశెట్టి, టీడీపీ నేతలు నియాజ్‌అలీ, నీరజాక్షులురెడ్డి, జీవరత్నం, శాంతకుమార్, టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి పాలన బాగుంది



కరపత్రాలు ఇస్తున్న టీడీపీ నేతలు

పెనుమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాక్షస పాలన పోయి సుపరిపాలన వచ్చిందని, కూటమి ప్రభుత్వంలో అరాచకాలకు తావులేదని మహిళలు స్పష్టంచేశారు. మంగళవారం మండలంలోని పులికల్లు పంచాయతీ చెర్లోపల్లిలో ఇంటింటికి టీడీపీ నాయకులు వెళ్లి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. కూటమి పాలన బాగుంది.. ఫించను, తల్లికి వందనం, మూడు సిలిండర్‌లు వచ్చాయని మహిళలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, మాజీ ఎంపీటీసీ గోపాల్‌నాయుడు, నాయకులు భాస్కర్, షణ్ముగవర్మ, నరేంద్ర,నరసింహులు నాయుడు, జయచంద్ర, సురేంద్ర నాయుడు, కోదండ నాయుడు, రాజగోపాల్ నాయుడు, శ్రీనివాస చౌదరి, మహిళలు పాల్గొన్నారు.

మా భూమికి రక్షణ కల్పించండి

చిత్తూరు సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దురాక్రమణ నుంచి తమ భూమికి రక్షణ కల్పించాలని గుడిపాల మండలం బుచ్చన్నకండ్రిగ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మొగిలి నాయుడు కోరారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తన కష్టార్జితంతో సంపాదించుకున్న భూమిని తమ గ్రామానికి చెందిన మునేంద్ర నాయుడు కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సోమవారం తన తల్లిపై దాడిచేశారని చెప్పారు. మునీంద్ర నాయుడికి ఎమ్మెల్యే తండ్రి మద్దతు ఉండడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తమ కుటుంబానికి మునేంద్ర నాయుడు, రాజేష్, శాంతి, మధులనుంచి ప్రాణహాని ఉందని చెప్పారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

రైతు బలపడితేనే గ్రామాభివృద్ధి సాధ్యం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతు బలపడితేనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని పంటపల్లె పంచాయతీ వెంకటరామాపురంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద చిన్నిక్రిష్ణమ నాయుడి పొలంలో కొబ్బరిమొక్కలను మంగళవారం నాటారు. ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడ్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన శిలా ఫలకం ఆవిష్కరించి, గోకులం షెడ్డు ప్రారంభించి, పంటపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటా టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంచిపెట్టారు. యువరాజుల నాయుడు, దొరబాబు చౌదరి, చంద్రమౌళి, నీరజ, ఎంపీడీవో నాగరాజు, సంధ్యారాణి, నర్సింహులు, నాయకులు చంద్రబాబు, సురేంద్ర నాయుడు, పరంధామ నాయుడు, గుంటూరు మురళి, ముని రత్నం నాయుడు, సురేష్, హరి, దాము, అర్జున్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడాలి



విద్యార్థులకు పుస్తకాలు ఇస్తున్న నారాయణస్వామి, కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్న తయ్యూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు పలక, నోట్‌బుక్, పెన్సిల్, అందించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, ఉమ్మడి జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, జనార్ధన్, విజయబాబు, శ్యామ్‌రాజ్, మణి, బాబు, జనార్ధన్ పాల్గొన్నారు.

● గంగాధరనెల్లూరు(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై తన కుమార్తె కృపాలక్ష్మి అనుచితవ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే తానుగాని, తమ కుటుంబసభ్యులుగాని రాజకీయాలకు స్వస్తి పలుకుతామని నారాయణస్వామి వెల్లడించారు. గంగాధరనెల్లూరులో వైఎస్ విగ్రహానికి పూలమాలలువేసి నేతలు నివాళులు అర్పించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, నేతలు వెంకటరెడ్డి, బాబురెడ్డి, గుణారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరిలో జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, విద్యార్థి విభాగ మండల అధ్యక్షుడు సువ్వాల జగదీష్‌రెడ్డి, నాయకులు పొన్నయ్య, కేశవులు, అమరనాథ్, వెంకటాచలం ఉన్నారు. ● నగరి (ఆంధ్రజ్యోతి): నగరి టవర్ క్లాక్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్‌ఛైర్మన్ నీలమేఘం, బీడీ భాస్కర్, వెంకటరత్నం, బాలన్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● చిత్తూరు అర్బన్ (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి స్థానిక డీసీసీబీ బ్యాంకు ఆవరణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ పార్టీ నేతలు నగరంలోని పలు కూడళ్లలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అన్నదానం చేశారు. మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు జ్ఞాన జగదీశ్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నేతలు పురుషోత్తంరెడ్డి, రాహుల్‌రెడ్డి, నారాయణ, హరిణిరెడ్డి, అంజలిరెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న విజయానందరెడ్డి

జనసైనికుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసైనికులు

వెదురుకుప్పం, జూలై 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అనుచిత పోస్టు పెట్టారని, ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం మంగళవారం తెలిపారు. జనసైనికులతో కలసి వెళ్లి ఫిర్యాదు చేశామన్నారు. జనసైనికులు చందు, ముని, యతీశ్వర్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

వైసీపీ బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణమరాజు

విజయపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీ విభాగం బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నారపరాజు కండ్రిగకు చెందిన రామకృష్ణమరాజును పార్టీ అధిష్ఠానం నియామకం చేసింది. ఆయన సుదీర్ఘ కాలం మండల వైసీపీ అధ్యక్షుడిగా, నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా విధులు నిర్వహించారు.

వైసీపీ ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కృష్ణారెడ్డి

పెనుమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీ ఆర్టీఐ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రామాపురానికి చెందిన పి.కృష్ణారెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. పలువురు పార్టీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ముత్యాలమ్మ ఆలయంలో వేలం

చిత్తూరు కల్చరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని తేనె బండ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవికలు, సజీవ కోళ్లను ఏడాది కాలం సేకరించే హక్కు, ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పూజ సామగ్రి విక్రయించుకునే హక్కులకే బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకట్రాయలు ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్చు పాటదారులకు కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

13న ప్రేమవాహిని రథయాత్ర ఆరంభం



ప్రేమ వాహని రథయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సత్యసాయి సేవా సమితి నాయకులు

చిత్తూరు కల్చరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 13, 14, 15 తేదీల్లో ప్రేమవాహని రథయాత్ర నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షులు యస్.మధుసూదనం తెలిపారు. 13న పెనుమూరు, 14న చిత్తూరు, 15న పలమనేరు, కుప్పంలలో రథయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పురుషోత్తం

వెదురుకుప్పం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలులు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో పురుషోత్తం మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పంచాయతీల అభివృద్ధికి రూపకల్పన చేయడం గురించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో నాగమణి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కోదండరామిరెడ్డి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గాయత్రి, ఉద్యోగులు హాజరయ్యారు.

● కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఎంపీడీవో చంద్రమౌళి పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో బుక్కాపట్నం మధుసూదన్, ఉద్యోగులు హాజరయ్యారు.

● విజయపురం (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని, పచ్చదనం, పరిశుభ్రతను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ గిరీష్‌కుమార్, ఏపీవో కవిత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెనుమూరు(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులే కీలకమని, ముందుగానే ఓ ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లకు పంచాయతీ పురోగతిపై శిక్షణ తరగతులు నిర్వహించారు.

అన్నదానానికి రూ.35 వేల విరాళం



దాతలకు తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయ అర్చకులు

చౌడేపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల అన్నదానం కోసం రూ.35 వేలు విరాళంగా అమ్మవారి భక్తులు ఇచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన అమ్మవారి భక్తులు రామోజీగౌడ్, మంజుల దంపతులు రూ.25 వేలు, మదనపల్లెకు చెందిన మాధవరెడ్డి, రాధారాణి దంపతులు రూ.10 వేలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.